క్లుప్తంగా

బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ



బాల్య వివాహలపై అవగాహన ర్యాలీ చేస్తున్న సిబ్బంది

పాలకొండ: మండలంలోని కొండాపురంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ, ఆశ వర్కర్ల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టి, ప్రజలకు అవగాహన కల్పించారు.

లడ్డూ ప్రసాదం వేలంపాట



లడ్డూ ప్రసాదంతో భక్తుడు సూర్యప్రకాశరావు

గుమ్మలక్ష్మీపురం: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ఆర్సీసీ కాంప్లెక్స్ ఆవరణలో లడ్డూ ప్రసాదం వేలంపాట సోమవారం నిర్వహించారు. ఇదే గ్రామానికి చెందిన స్వాతీ రడీమేడ్ షాపు యజమాని కొనిస సూర్యప్రకాశరావు వేలంపాటలో పాల్గొని, రూ.8 వేలు చెల్లించి, లడ్డూ ప్రసాదం దక్కించుకున్నారు. అనంతరం ఆ లడ్డూ ప్రసాదాన్ని సర్పంచ్ బి.గౌరీశంకరరావు చేతులమీదుగా ఆయనకు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన శంకరరావు

వీరఘట్టం: మండలంలోని కడకెల్ల గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. వీరఘట్టం నుంచి పార్వతీపురం వైపు బైక్పై పి.శంకకరావు, ఎన్. అంబరీష్ వస్తున్నారు. సరిగ్గా కడకెల్ల మలుపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లగేజీ ఆటో ఢీకొనడంతో ఇద్దరూ పడిపోయారు. గాయాలపాలైన వీరిని స్థానికులు 108 వాహనంలో పార్వతీపురం ఆస్పత్రికి తరలించారు.

ఐటీడీఏ స్వతంత్రతను కాపాడాలి



నిరసన తెలుపుతున్న గిరిజన సంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: జిల్లా ఏర్పాటు తర్వాత పార్వతీపురం ఐటీడీఏ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని, ఇది ఏమాత్రం సహించేది లేదని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్కుమార్ అన్నారు. ఈమేరకు చలో ఐటీడీఏ పేరుతో సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏకు రెగ్యులర్ పీఓ, డీడీ లేకపోతే పాలన ఎలా ముందుకుసాగుతుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఐటీడీఏకు వచ్చే నిధులను గిరిజనుల సంక్షేమం కోసం మాత్రమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థుల మరణాలు పాలకులకు పట్టడం లేదా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏఎన్ఎంల నియామకం హామీపై మొదటి సంతకం ఏమయ్యిందని గిరిజన సంక్షేమశాఖ మంత్రిని ప్రశ్నించారు. ఐటీడీఏ స్వతంత్రతను కాపాడాలని, పాలక వర్గం సమావేశాలు ఏర్పాటు చేసి గిరిజన సమస్యలపై చర్చించాలని, పీఓ ఆధ్వర్యంలో గిరిజన స్పందన ఏర్పాటు చేయాలని కోరారు. వైటీసీ, గిరిజన గర్భిణుల వసతి గృహం సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఐటీడీఏ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో కుక్, కమాటీ, వాచ్మెన్ తదితర ఖాళీలను గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జీఓ-3 పునరుద్ధరణకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని, గిరిజన డీఎస్సీ ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు గంగరాజు, ప్రభాకర్, సీతారాం వెల్లూరు, బంగార్రాజు, భాస్కరరావు, నాగార్జున, ముత్యాల, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మూలకు చేరిన అంబులెన్స్‌లు...

- 14 వాహనాలకు గాను అందుబాటులో ఉన్నవి ఆరు
- అత్యవసర సమయాల్లో రోగులకు తప్పని అవస్థలు
- అందరికీ 108 వాహనమే ఆధారం



పాత కలెక్టర్ బంగ్లా వద్ద పడి ఉన్న రెండు అంబులెన్స్‌లు

సీతంపేట: అత్యవసర పరిస్థితుల్లో ఎంతో మందిని ఆస్పత్రులకు తరలించే అంబులెన్స్‌లు ప్రస్తుతం మూలకు చేరాయి. కొండలను సైతం ఎక్కి అక్కడుండే గిరిజన రోగులు, గర్భిణులను సకాలంలో ఆస్పత్రులకే చేర్చే అంబులెన్స్‌లకే రోగం వచ్చింది. నెలల తరబడి పక్కన ఉంచేయడంతో అంబులెన్స్‌లు తుప్పుపట్టి ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. ఐటీడీఏ ద్వారా నిర్వహించే అంబులెన్స్‌లు పాడయ్యాయి. నెలలు గడుస్తున్నా వాటికి మరమ్మతులు చేపట్టే నాథుడే లేకుండా పోయాడు. దీంతో గిరిజనులకు అంబులెన్స్ సేవలు అంతంతమాత్రంగా అందుతున్నాయి. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 1252 గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల్లో సుమారు రెండు లక్షల మంది జనాభా నివస్తున్నారు. వీరందరికీ వైద్యసేవలు అందించేందుకు 27 పీహెచ్‌సీలు, 2 ఏరియా ఆస్పత్రులు, 3 సీహెచ్‌సీలు, 151 ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలున్నాయి. వీటి పరిధిలో 14 అంబులెన్స్‌లు కూడా ఉండేవి. అయితే నిధుల కొరత కారణంలో నాలుగు వాహనాలను నిలిపివేయగా.. మరో నాలుగు పాడయ్యాయి. ప్రస్తుతం ఆరు అంబులెన్స్‌లు మాత్రమే తిరుగుతున్నాయి. అయితే కొండలపై ఉన్న గ్రామాలతో పాటు మారుమూల గ్రామాలకు చెందిన రోగులను శ్రీకాకుళం రిమ్స్, విశాఖ కేజీహెచ్ వంటి ఆస్పత్రులకు తరలించడానికి ప్రస్తుతం ఉన్న ఆరు అంబులెన్స్‌ల సేవలు సరిపోవడం లేదు. వీటితో పాటు 108 వాహనాన్ని వినియోగిస్తున్నా రోగులకు సరైన సేవలు అందడం లేదు. అధికారులు స్పందించి అంబులెన్స్‌లకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



ఐటీడీఏ ఆవరణలో నిరుపయోగంగా అంబులెన్స్‌లు

మరమ్మతులకు ప్రతిపాదనలు చేశాం..



అంబులెన్స్‌ల మరమ్మతులకు ఎంత నిధులు అవసరమో అంచనా వేయించాం. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే వాహనాలకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకువస్తాం. కె.విజయపార్వతి, డీఎంహెచ్ఓ

వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: ఐటీడీఏ ఆవరణలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 24 వినతులు వచ్చాయి. అయితే ఆర్థిక పరమైన సమస్యలు పరిష్కరించడానికి ఐటీడీఏలో ఎటువంటి నిధులు లేవని పీఓ తెలియజేయడంతో గిరిజనులు నిరాశ చెందారు. కార్యక్రమంలో ఏపీఓ జి.చిన్నబాబు, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం, డిప్యూటీ ఈఓ నారాయుడు, ఏఎంఓ కోటిబాబు, పీహెచ్ఓ గణేష్, సీడీపీఓ రంగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అంతరపంటలపై దృష్టి సారించండి



చినమంగళాపురంలో క్రిష్ణంనాయుడు తోటలను పరిశీలిస్తున్న అధికారి

పాలకొండ రూరల్: పామాయిల్ తోటలు సాగు చేస్తున్న రైతులు అంతరపంటలపై దృష్టి సారించాలని ఉద్యానవన శాఖాధికారి తమ్మినేని అమరేశ్వరి అన్నారు. మండలంలోని చిన మంగళాపురంలో పామాయిల్ తోటల్లో సాగు చేస్తున్న కోకో పంటను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో కోకో సేద్యానికి సంబంధించి తమ శాఖ ద్వారా రాయితీలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఎకరాకు రెండు వందల మొక్కలు చొప్పున రాయితీపై అందిస్తామన్నారు. ఔత్సాహిక రైతులు ఉద్యానవన శాఖాధికారులను సంప్రదించాలన్నారు.

గీతా సారాంశం తెలుసుకోవాలి



గీతా సారాంశాన్ని ప్రచారం చేస్తున్న ఇందూ విజ్ఞాన వేదిక ప్రతినిధులు

పాలకొండ రూరల్: ప్రతిఒక్కరూ గీతా సారాంశం తెలుసుకోవాలని త్రైత సిద్ధాంతం - ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక సభ్యులు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక వడమ కాలనీతో పాటు మండల పరిధిలోని అంపిలి, అన్నవరం గ్రామాల్లో దసరా వేడుకల్లో భాగంగా ప్రచారం చేపట్టారు. ఆది మధ్యాంత రహితుడైన పరమాత్మ ఈ భూమిపై భగవంతునిగా అవతరించి మానవాళిని సన్మార్గంలో నడిపిస్తున్నారన్నారు. అలాగే గీతా సారాంశాన్ని వివరిస్తూ, భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇందూ విజ్ఞాన వేదిక శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్, సభ్యులు గోపాలకృష్ణ, రామకృష్ణ, వెంకటరావు, స్వాతి, దుర్గారావు, లక్ష్మి, చిన్నప్పలనాయుడు, లావణ్య పాల్గొన్నారు.

రైతాంగ ప్రాంతీయ సదస్సును విజయవంతం చేయండి

- ఏపీ రైతు సంఘ ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు



కరపత్రాలు విడుదల చేస్తున్న రైతు సంఘాల నాయకులు

పాలకొండ రూరల్: సాగునీటి వనరుల సమస్యల పరిష్కారానికై ఈ నెల 22న అనకాపల్లిలో నిర్వహించనున్న రైతాంగ ప్రాంతీయ సదస్సును విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘ ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు సదస్సుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాగునీటి వనరులను నిర్లక్ష్యం చేయడం ద్వారా లక్షలాది ఎకరాల్లో సాగుకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 25 వేల చెరువుల కింద 23.24 లక్షల ఎకరాల భూములు ఉన్నాయన్నారు. అయినప్పటికీ కేవలం 8 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోందని తెలిపారు. సాగునీటి సమస్యలు పరిష్కరిస్తే భూములన్నీ సస్యశ్యామలం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఓటర్ల జాబితా సిద్ధం చేయండి



మాట్లాడుతున్న ఉపతహసీల్దారు లక్ష్మీకుమార్

గరుగుబిల్లి: సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి, ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఉప తహసీల్దారు పీఎస్ లక్ష్మీకుమార్ వీఆర్‌వోలకు సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తోటపల్లి పాత రెగ్యులేటర్ కుడి, ఎడమ కాలువల ఏఈ డీవీ రమణతో కలిసి వీఆర్‌వోలతో సోమవారం సమావేశమైన ఆయన.. ఈ నెల 16 నుంచి నవంబరు 24వ తేదీలోగా సాగునీటి సంఘాల ఎన్నికలు పూర్తి చేయాలన్నారు. తోటపల్లి పాత రెగ్యులేటర్ కుడి, ఎడమ కాలువల పరిధిలోని సంఘాలతో పాటు 13 సాగునీటి చెరువుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఆర్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర వచ్చేలా చూడండి

భామిని: రానున్న ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం నాణ్యత గుర్తింపులో సాంకేతికత పాటించి మద్దతు ధర వచ్చేలా చూడాలని సివిల్ సప్‌లైస్ టెక్నికల్ అసిస్టెంట్ రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో టీఏ, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లు, వీఏఏలకు సోమవారం జరిగిన శిక్షణ సదస్సులో ఆయన మాట్లాడుతూ, గ్రేడ్ -1 రకం ధాన్యానికి రూ. 2320, కామన్ రకాలకు రూ. 2300 మద్దతు ధర వచ్చేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు.కార్యక్రమంలో ఏఓ కె. సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొమ్మల పండుగ

భామిని: మండలంలోని పాత ఘనసరలో సోమవారం కొమ్మల దసరా ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కిల్లారి కమల, కిల్లారి ఫాల్గుణరావు ఆధ్వర్యంలో రైతులు ఊడిక కొమ్మలు తీసుకువచ్చి, అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆ కొమ్మలను పొలాల్లో పాతారు.

పంటకోత ప్రయోగంపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న సివిల్ సప్లయి అధికారులు

గుమ్మలక్ష్మీపురం: మండల పరిషత్ కార్యాలయంలో పంటకోత ప్రయోగం, ధాన్యం కొనుగోళ్లపై వీఏఏలు, వీహెచ్ఏలకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం పంట కోత దశకు చేరుకోవడంతో ఏ విధంగా పంటకోత ప్రయోగం చేసి, దిగుబడి అంచనా వేయాలి, ఏ రకమైన ధాన్యానికి ఏ రకమైన మద్దతు ధరకు కొనుగోలు చేయాలి, ధాన్యం తూకం వంటి అంశాలను సివిల్ సప్లయి అధికారులు వివరించారు. ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా చేపట్టాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాలకొండ రూరల్: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 20 వార్డులతో పాటు మండల పరిధిలో దాదాపుగా అన్ని పంచాయతీల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏరియా ఆస్పత్రికి ఎక్స్‌రే యూనిట్లు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రికి కొత్తగా రెండు ఎక్స్‌రే యూనిట్లు మంజూరైనట్లు ఆస్పత్రి సూపరింటిండెంట్ బి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో ఒకటి సంచార ఎక్స్‌రే అని పేర్కొన్నారు. ఈ మెషీన్‌ను రోగుల వద్దకు తీసుకెళ్లి ఎక్స్‌రేలు తీస్తామన్నారు. మరొకటి ప్రత్యేక గదిలో ఏర్పాటు చేస్తామని, రోగులకు ఇబ్బందులు కలగకుండా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

ఈ-పంట ముసాయిదా జాబితా ప్రచురణ

బలిజిపేట: ఖరీఫ్ ఈ-పంట ముసాయిదా జాబితాను ఆర్బీకేల్లో సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించడం జరిగిందని ఏఓ శ్రావణ్‌కుమార్‌నాయుడు తెలిపారు. వెంగాపురంలో ప్రదర్శించిన జాబితాను సోమవారం ఆయన పరిశీలించారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలియజేయాలని రైతులకు సూచించారు. గ్రామాల్లో ముసాయిదా జాబితాపై గ్రామసభలు నిర్వహించి అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందన్నారు. స్వీకరించిన అభ్యంతరాలను పరిశీలించి తుది జామితాలను రూపొందించనున్నట్లు చెప్పారు.



ఆకాశంలో వెండి కొండలు..

ఓ వైపు ఎండ వేడిమి.. మరో వైపు వాయుగుండం ప్రభావంతో తేలికపాటి చినుకులతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. పాలకొండ ప్రాంతంలో సోమవారం తేలికపాటి చినుకులు పడిన తర్వాత ఆకాశం నిర్మలంగా కనిపించింది. ఈ సమయంలో ఆకాశంలోని తెల్లటి మబ్బులు వెండి కొండల్లా దర్శనమిచ్చాయి.

– పాలకొండ

ఇంకుడుగుంతల నిర్మాణానికి భూమిపూజ



సీఎస్పార్ పేటలో ఇంకుడు గుంతల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అధికారులు, గ్రామస్తులు

వీరఘట్టం: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిదిమి, యు.వెంకమ్మపేట, సీఎస్పార్ పేట గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ మేరకు అధికారులు, గ్రామపెద్దలు భూమి పూజ చేశారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడుతున్న ఈ నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏపీడీ శ్రీహరిరావు సూచించారు. కార్యక్రమంలో చిదిమి సర్పంచ్ దమలపాటి ఉమామహేశ్వరరావు, ఏఈ కళ్యాణిదుర్గ, ఏపీఓ జి.సత్యంనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎటు చూసినా చెత్తకుప్పలే..



ఎంపీడీఓ కార్యాలయం ముందు ప్రధాన రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

పాలకొండ: నగర పంచాయతీలో రోజు రోజుకూ చెత్త పేరుకుపోతోంది. ప్రతి రోజూ పారిశుధ్య పనులు చేయించడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రహదారులపై చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. కనీసం చెత్త కుండీల్లోని చెత్తను కూడా సిబ్బంది తీయడం లేదని ప్రజలు చెబుతున్నారు. ఆర్డీఓ, ఎంపీడీఓ కార్యాలయాల ఎదురుగా ఉన్న చెత్త కుండీలు పూర్తిగా నిండిపోయినా ఎవ్వరూ పట్టించుకోకపోవడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చురుగ్గా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న ఎంఈవో చంద్రశేఖర్, తదితరులు

గుమ్మలక్ష్మీపురం: మండల విద్యావనరుల కేంద్రంలో సీఆర్‌టీగా పనిచేస్తున్న చిట్టిబాబుకు ఎంఈవో బి.చంద్రశేఖర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఎమ్మార్సీ సిబ్బంది అంతా కలిసి ఆర్థికసాయం చేశారు. చిట్టిబాబు బోర్న్ బేబీకి అత్యవసర చికిత్స కోసం డబ్బులు అవసరం కాగా మానవతా దృక్పథంతో స్పందించిన దాతలు పోగు చేసిన రూ.లక్షను ఆర్థికసాయంగా సోమవారం అందజేశారు. ఆపదలో ఉన్న చిరుద్యోగిని ఆదుకోవడం ఆనందంగా ఉందని దాతలు తెలిపారు.

విధుల్లో అలసత్వం వద్దు



ప్రధానోపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో అప్పలనాయుడు

గరుగుబిల్లి: విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని ఎంఈవో-1 దత్తి అప్పలనాయుడు సూచించారు. ఆయన ఇటీవల ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో మండలంలోని ఉల్లిభద్ర గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. ప్రతిఒక్కరూ చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలని, మండలానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందేలా చూడాలన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

- కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



గుమ్మలక్ష్మీపురం: సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని ఎస్కే పాడు గ్రామంలో ఉన్న ఐటీడీఏ అడ్వంచర్ పార్క్‌లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి మంజూరైన రూ.48 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులతో పాటు కురుపాం మండలంలోని మరిపల్లి, దురుబిల్లి గ్రామాల రోడ్ల నిర్మాణానికి ఆమె సోమవారం భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పల్లె పండగ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించిందని తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహించే ఈ పల్లె పండగ కార్యక్రమంలో శ్రీకారం చుట్టిన పనులను వచ్చే కొత్త సంవత్సరంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు ఎస్.సాల్మన్‌రాజు, జె.ఉమామహేశ్వరి, టీడీపీ కన్వీనర్లు పాడి సుదర్శనరావు, కొండయ్య, కోలా రంజిత్‌కుమార్, పంచాయతీరాజ్ డీఈ జి.శ్రీనివాసరావు, ఏఈ కె.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: మండలంలోని ఆర్తాం, గుణానపురం, దుగ్గి, కళ్లికోట గ్రామాల్లో ఏపీవో బాలకృష్ణ ఆధ్వర్యంలో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించి, పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అలమండ, పీటీ మండ, శిఖబడి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చంటి, ఎంపీడీవో ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పనుల గుర్తింపు

సీతంపేట: మండలంలోని రాయిమానుగూడ, దీసరిగూడ, పత్తికగూడ, గొయిది, నాయుడుగూడ, కుడ్డపల్లి పంచాయతీల్లో సోమవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి భూమి పూజ చేసినట్లు ఎంపీడీఓ కె. గీతాంజలి తెలిపారు. ఉపాధి నిధులతో పనులు చేపడతామన్నారు.

గరుగుబిల్లి: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంకుడుగుంతల నిర్మాణానికి సర్పంచ్ కె.ఇందుమతి, ఎంపీడీవో జి.పైడితల్లి సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏపీవో ఎం.గౌరీనాథ్, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు, ప్రధానోపాధ్యాయుడు పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన



నాణ్యతా ప్రమాణాలు పరిశీలిస్తున్న విజిలెన్స్ ఇంజనీరింగ్ అధికారులు

సీతంపేట: గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ ద్వారా గతంలో చేపట్టిన పనులను విజిలెన్స్ ఇంజినీరింగ్ అధికారులు సోమవారం పరిశీలించారు. రూ.50 లక్షలతో గొయ్యిగూడ నుంచి జోడిమానుగూడ వరకు నిర్మించిన రహదారి, రూ.1.80 లక్షలతో నిర్మించిన లక్కాయిగూడ - ఈతమానుగూడ రహదారి పనులను పరిశీలించి, నాణ్యతపై ఆరా తీశారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఏఈ నాగభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

భామిని: విద్యుత్ తీగలు పడి పాడి ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని సింగిడిలో సోమవారం చోటుచేసుకుంది. వీచిన ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు పడడంతో విద్యుత్‌తీగలు తెగి రోడ్డుమీద పడ్డాయి. ఆ సమయంలో అదే దారిలో వెళ్తున్న నిమ్మల మాధవరావు అనే రైతుకు చెందిన ఆవు వేళ్లే తీగలను తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు.